విశాఖపట్టణం
మంగళవారం 22 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 221 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# ఈడీ కస్టడీలో కారుమూరి



### రెండు రోజుల పాటు విచారణ

### కీలక సమాచారం కోసం ఈడీ పట్టు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి ఈడీ కార్యాలయానికి తరలించిన అధికారులు.. ఆయనను రెండు రోజుల పాటు విచారించనున్నారు. ఏపీఎస్బీసీఎల్ లిక్కర్ రవాణా టెండర్ల కేసు విచారణలో భాగంగా కారుమూరిపై పలు ప్రశ్నలు ..మిగతా 2లో



## రౌడీయిజం చేస్తే
# తోక కత్తిరిస్తాం

### టీచర్లపై దాడులను ఊరుకోం

### కఠిన చర్యలు తీసుకుంటాం

### అసెంబ్లీకి వస్తే ఆధారాలతో సమాధానమిస్తాం

### నా హయాంలో ఎన్నడూ పేపర్ లీక్ కాలేదు

### 14 డిఎస్సీలను పకడ్బందీగా నిర్వహించిన ట్రాక్ రికార్డు నాది

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

### కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

(కుప్పం - జయజయహే)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు మౌలిక వసతులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో రూ.10 కోట్ల వ్యయంతో ..మిగతా 2లో

# శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

### అక్రమ డీఎస్సీపై నిరసనకు వైసీపీ పిలుపు

### అదే సమయంలో స్పోర్ట్స్ కోటా టీచర్లు ఆందోళన

### పోటీపోటాగా ఇరువర్గాలు నిరసనల హోరు

### రంగంలోకి దిగిన పోలీసులు





(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైఎస్సార్ సీపీ ఆరోపిస్తోంది. ఆ ఆరోపణలకు సంబంధించి జిల్లాల అధికారులు సాక్ష్యాలతో వివరణ ఇచ్చినా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల భర్తీపై వివాదం సద్దుమణగలేదు. ఈ క్రమంలో విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఎంపికలపై పోటాపోటీ నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో పలు జిల్లాల నుంచి వైసీపీ కార్యకర్తలతో పాటు మెగా డీఎస్సీ అభ్యర్థులు సైతం శాప్ కార్యాలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎగ్జామ్ నిర్వహించకుండా, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు లేకున్నా నియామకాలు జరిగాయని, ఒకే ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇచ్చారనివైసీపీ ఆరోపిస్తోంది. మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ఆ ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ స్పోర్ట్స్ కోటా టీచర్లు శాప్ కార్యాలయం వద్ద శాంతియుత ర్యాలీకి సిద్ధమయ్యారు. తాము ఎంతో కష్టపడి స్పోర్ట్స్ కోటా ద్వారా టీచర్ జాబ్ సంపాదిస్తే.. లంచాలు ఇచ్చారు, దొడ్డిదారిలో జాబ్ తెచ్చుకున్నారని ఆరోపించడం మా కష్టాన్ని గుర్తించకపోవడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. మరొకవైపు, డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని, వీటిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు చేరుకుంటున్నారు. అయితే ఈ రెండు వర్గాల నిరసన కార్యక్రమాలకు పోలీసులు ముందస్తు అనుమతిని నిరాకరించారు. ఆ ప్రాంతంలో సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఎలాంటి ధర్నాలు, నిరసనలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ నిరసన తెలిపి తీరుతామని ..మిగతా 2లో

# దాడులపై సీరియస్

### ఏ ఒక్కర్నీ వదిలిపెట్టొద్దు

### దాడుల్లో ఉన్న రౌడీషీటర్లను అదుపులోకి తీసుకోవాలి

### క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందే

### సీసీటీవీ, వీడియో ఫుటేజీ ఆధారంగా గుర్తించండి

### ముందస్తు ప్రణాళికతోనే వైసీపీ దాడులు

### పోలీసు ఉన్నతాధికారులకు సీఎం, మంత్రులు ఆదేశాలు

2

# ఎవరినీ వదిలిపెట్టం!

### క్రిమినల్ గ్యాంగ్ భరతం పడతాం.. గురువులపైనే దాడులు చేస్తారా

### రౌడీషీటర్లు, గంజాయి, బ్యాడ్ బ్యాచ్ లను దించుతారా

### వైసీపీ ప్రేరేపిత కుట్రలను సహించబోం

### శాప్ వద్ద వైసీపీ ఆందోళనపై మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం

(విజయవాడ - జయజయహే)



విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడి చేయడంపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. గురువులపై దాడి చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టమని ..మిగతా 2లో

## జూడాలకు
# స్టైఫండ్ పెంపు

### 3.5 శాతం పెంపునకు గ్రీన్ సిగ్నల్

### గత జనవరి నుంచి వర్తింపు

### జీఓ జారీ చేసిన ప్రభుత్వం

(అమరావతి - జయజయహే)



ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో విధులు నిర్వహణ అందిస్తున్న జూనియర్ డాక్టర్లకు (జూడా) రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ పెంపు డిమాండ్‌పై సానుకూలంగా స్పందిస్తూ అధికారికంగా జీవో విడుదల చేసింది. పెరిగిన ఈ స్టైపెండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌షిప్ చేస్తున్న హౌస్ సర్జన్లకు 10 శాతం, పీజీ విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ ..మిగతా 2లో



# అంత భయమెందుకు..?

### నియంతల పాలనలో కూడా ఇలా లేదు

### తప్పు లేకపోతే సీబీఐ విచారణకు ఆదేశించండి

### చంద్రబాబుకి వైసీపీ నేత సజ్జల సవాల్

(తాడేపల్లి - జయజయహే)

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై చెలరేగిన వివాదం తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతోంది. టెట్ అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇవ్వడం, ఈడబ్ల్యూఎస్ కోటాలో అక్రమాలు చేయడం, నకిలీ సర్టిఫికెట్లతో పోస్టులను అమ్ముకోవడం వంటి అనేక అక్రమాలు జరిగాయని వైసీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కోర్టును ఆశ్రయించిన తర్వాతే ఈ వ్యవహారం బయటకు వచ్చిందని, ఈ నియామక ప్రక్రియపై సీబీఐ వంటి స్వతంత్ర సంస్థతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీ పర్యవేక్షణ చూసిన మంత్రులు పదవుల్లో కొనసాగకూడదని, శాంతియుత నిరసనలపై దాడి చేసి తిరిగి తమపైనే ఆరోపణలు చేయడం దారుణమని ..మిగతా 2లో

## పిఠాపురంలో
# పవన్ బిజీ..బిజీ!

### పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

### పీఠికాపుర వనం లాంఛనంగా ప్రారంభం

(కాకినాడ - జయజయహే)



కాకినాడ జిల్లా పిఠాపురంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రూ.1.83 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం' (నగర వనం) ను లాంఛనంగా ప్రారంభించారు. రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం పలు అభివృద్ధి కార్యక్రమాలను పవన్ ప్రారంభించారు. గతంలో చెత్త వేసే డంపింగ్ యార్డుగా ఉండి, నిరుపయోగంగా ఉన్న ఐదున్నర ఎకరాల ప్రాంతాన్ని ప్రజలకు ఉపయోగపడే ఆకర్షణీయమైన పట్టణ హరిత ప్రదేశంగా అటవీ శాఖ తీర్చిదిద్దింది. ఈ కార్యక్రమంలో భాగంగా పవన్ కళ్యాణ్ మొక్క నాటారు. కాకినాడ ఎంపీ ..మిగతా 3లో

## వైసీపీకి వరుసుల
# రాజీనామా

### పవన్ సమక్షంలో జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే

2



## రాజధాని కోసం
# మరో 14.365 ఎకరాలు

### రైతులతో అంగీకార పత్రాలు స్వీకరణ

### రెండో విడత భూ సమీకరణ వేగవంతం

2

## ఉత్తరాంధ్రకు
# తీవ్ర వాయు గండం

### బలపడుతున్న అల్పపీడనం

### నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

### బలమైన ఈదురు గాలులు వీచే ఛాన్స్

### వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక

### అధికారులతో సమీక్ష చేసిన హోం మంత్రి అనిత

2

# రౌడీయిజం చేస్తే తోక కత్తిరిస్తాం

మొదటి పేజీ తరువాయి...

నిర్మించనున్న ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు రూ.3.30 కోట్ల వ్యయంతో సిద్ధం చేసిన సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ప్రారంభించారు. అలాగే 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.70 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న మల్లనూర్ జూనియర్ కళాశాల పనులకు భూమిపూజ చేశారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలుగా 15 మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను సీఎం జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలో ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడుల అంశంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీచర్ల రిక్రూట్మెంట్‌కు సంబంధించి ప్రతిపక్షాలు చేస్తున్న ఫేక్ ప్రచారాలను, విజయవాడలో స్పోర్ట్స్ టీచర్లపై జరిగిన దాడులను సీఎం చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. తమ పాలనలో నిర్వహించిన డీఎస్సీలు, ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఎలాంటి అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగలేదని తెలిపారు. సుమారు 14 సార్లు పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించిన ట్రాక్ రికార్డు తమదని స్పష్టం చేశారు. 355 పిటిషన్లు వేసి అడ్డంకులు సృష్టించినా చట్టబద్ధంగా ప్రక్రియ పూర్తి చేశామన్నారు.



డీఎస్సీ ఉద్యోగాలు తమ కష్టార్జితమని నినదిస్తున్న ఉపాధ్యాయులపై దాడులు చేయడం దారుణమని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా చర్చిస్తే వాస్తవాలు, సాక్ష్యాధారాలతో సమాధానం చెప్తామని, అక్రమంగా దాడులకు తెగబడితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జాతీయ స్థాయి కేంద్రాలు, నగరాల్లో టీచర్లు తమ నిరసన తెలపడాన్ని ప్రస్తావిస్తూ.. మీడియా ముసుగులో వైసీపీ మూకలు రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, బట్టలు ఊడదీసి నిలబెడతామని తీవ్రంగా స్పందించారు. కుప్పం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను సీఎం వివరించారు. నియోజకవర్గంలో 8,904 బంగారు కుటుంబాలను గుర్తించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు పీ4 కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేయూత అందిస్తోందని సీఎం తెలిపారు. కుప్పాన్ని పూర్తి స్థాయిలో పేదరికం లేని ప్రాంతంగా మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. కుప్పంలో చెత్త రహిత వాతావరణం కల్పించేందుకు 82 ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా వ్యర్థాల నుంచి కాంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నట్లు తెలిపారు చంద్రబాబు. ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలన్నీ 'నెట్ జీరో' లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. సోలార్ రూఫ్‌టాప్ విధానం ద్వారా ప్రతి ఇల్లు ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు.

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు రూపొందించిన సంజీవని ప్రాజెక్టును ఒక గేమ్ ఛేంజర్‌గా చంద్రబాబు అభివర్ణించారు. కుప్పంలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల ద్వారా ఇప్పటికే 1.29 లక్షల మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరిచారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలోని 5 కోట్ల మంది పౌరుల ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేసి ఉచిత పరిరక్షణ చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. కంగుంది ప్రాంతంలో దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమ్యను పరిష్కరించి 320 మందికి ఇళ్ల పట్టాలు అందజేసినట్లు సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 'మీ భూమి - మీ హక్కు' పేరిట అధికారిక రాజముద్రతో కూడిన పట్టాలను అర్హులకు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు



## వైసీపీకి వరుపుల రాజీనామా

### పవన్ సమక్షంలో జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే

(ప్రత్తిపాడు - జయజయహే)

వైసీపీకి ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు రాజీనామా చేశారు. జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. సుబ్బారావుకు జనసేన కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితుడినై జనసేనలో చేరానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు వైసీపీపై షాకింగ్ కామెంట్స్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో కమీషన్లు కొట్టేశారని ఆరోపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో పనికి రాని భూములను ఇళ్లస్థలాల కోసమంటూ అధిక ధరలకు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. నేటికి పలు స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాల విషయంలో జగన్ విధానం సరిగా లేదని సుబ్బారావు ధ్వజమెత్తారు.

## ఈడీ కస్టడీలో కారుమూరి

మొదటి పేజీ తరువాయి...

సంధించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన అక్రమాలు, నగదు లావాదేవీలపై కీలక అంశాలను రాబట్టేందుకు విచారణ చేయనున్నారు. కాగా, ఈ కేసులో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల నష్టం జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు మాజీ మంత్రి కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్ సహా పలువురిని పీఎంఎల్ఏ కింద అరెస్ట్ చేశారు. కారుమూరిని ఈడీ కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే, ఈ కేసులో కీలక విషయాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్న ఈడీ అధికారులు.. మాజీ మంత్రిని కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



## రాజధాని కోసం మరో 14.365 ఎకరాలు

### రైతులతో అంగీకార పత్రాలు స్వీకరణ

### రెండో విడత భూ సమీకరణ వేగవంతం

(అమరావతి - జయజయహే)

కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు భూములిచ్చేందుకు రాజధాని ప్రాంత రైతులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠపురం గ్రామ పరిధిలోని మాదల కుటుంబం తమకు చెందిన 14.365 ఎకరాల భూమిని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏకు అందజేసేందుకు అంగీకరించింది. రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావడం పట్ల ఆ రైతు కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాదల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు అధికారిక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సమీకరణలో భాగంగా మాదల శ్రీనివాసరావు నుంచి 4.395 ఎకరాలు, మాదల అప్పారావు నుంచి 4.985 ఎకరాలు, అలాగే మాదల రాంబాబు నుంచి 4.985 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ బి. కన్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొని రైతులకు ధన్యవాదాలు తెలిపారు. నవ్యాంధ్ర రాజధాని నగరం ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన మాదల కుటుంబ సభ్యులు కోరారు. రెండో విడత భూసమీకరణకు అమరావతి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పూర్తిస్థాయిలో సహకరించి రాజధాని అభివృద్ధికి తోడ్పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయు గండం

(అమరావతి - జయజయహే)

ఉత్తర అండమాన్ సముద్రం, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలంగా కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. బుధవారం ఉదయానికి పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలకు సమీపంలో పశ్చిమ మధ్య, దాన్ని ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉంది. దీని ప్రభావంతో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేశారు. తీరం వెంట రేపు (మంగళవారం) 50-70 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెబుతున్నారు. ఈ ప్రభావంతో సోమ, మంగళవారాల్లో ఓ మోస్తరు వర్షాలు, బుధ, గురువారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. కోస్తాంధ్ర తీరం వెంట 50-60 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీయొచ్చు. సోమవారం అల్లూరి సీతారామరాజు, పోలవరం, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయుగుండం నేపథ్యంలో హోంమంత్రి అనిత అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే వాతావరణంలో మార్పువచ్చింది. జిల్లాలో ఈ రాత్రి నుంచి వర్షం పడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. రేపు, ఎల్లుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇదే సమయంలో ఒడిశాలో కురవనున్న వర్షాలకు వంశధార, నాగావళి, బహుదా, మహేంద్ర తనయ నదులకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అల్పపీడనం వల్ల ప్రభుత్వ యంత్రాంగాన్నిహోంమంత్రి అనిత అప్రమత్తం చేశారు. బుధవారం, గురువారం భారీవర్ష సూచనతో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాగులు, కాజ్‌వేల వద్ద ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనలను ప్రజలంతా పాటించాలని హోంమంత్రి అనిత తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. రెండ్రోజుల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని, ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల సంస్థ ఎండీతో హోంమంత్రి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర, జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచాలని అనిత అన్నారు.

## అంత భయమెందుకు..?

మొదటి పేజీ తరువాయి...

మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎటువంటి తప్పు జరగలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తే తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని సజ్జల సవాల్ విసిరారు. అక్రమాలు జరగకపోతే లోకేశ్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వ్యాఖ్యానించారు. శాసనమండలిలో ఈ అంశంపై చర్చకు విపక్షాలు కోరినప్పటికీ ప్రభుత్వం ఎందుకు నేరుగా సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు. శాప్ కార్యాలయం వద్ద వైసీపీ నిరసన తెలిపే రోజే టీడీపీ కార్యకర్తలను, టీచర్లను అక్కడికి పంపించడం వెనుక కుట్ర ఉందన్ సజ్జల ఆరోపించారు. తమపై దాడులకు ముందురోజు నుంచే ప్రణాళికలు సిద్ధం చేశారని, దీనిని వైసీపీ వర్సెస్ ఉపాధ్యాయుల మధ్య గొడవగా చిత్రీకరించే యత్నం సరికాదని హితవు పలికారు.

## జూడాలకు స్టైఫండ్ పెంపు

మొదటి పేజీ తరువాయి...

కోర్సులు అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులకు 3.5 శాతం చొప్పున స్టైపెండ్ పెరిగింది. ఈ పెంపు వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 34.08 కోట్ల అదనపు భారం పడనుంది. గత నెలలో జూనియర్ డాక్టర్లు తమ సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా స్టైపెండ్ పెంపు కోసం నిరవధిక సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రారంభంలో వైద్యులు తమ స్టైపెండ్‌ను 30 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్థిక పరిమితులను వివరిస్తూ వార్షిక పెంపు ప్రాతిపదికన సంవత్సరానికి 3 శాతం నుంచి 5 శాతం పెంపును ప్రతిపాదించగా, వైద్య సంఘాలు దానిని తిరస్కరించాయి. సుమారు 9,000 మంది జూనియర్ డాక్టర్లు సమ్మెలో పాల్గొనడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, మాతాశిశు వైద్యశాలలు, ఐసీయూ, అత్యవసర విభాగాల్లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సమ్మెలో ఉన్న వైద్య ప్రతినిధులతో పలు విడతల చర్చలు జరిపింది. వైద్యుల అభ్యర్థనలు, ఇతర రాష్ట్రాల్లోని వేతన విధానాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఈ నూతన పెంపును ఖరారు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం తమ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని స్టైపెండ్ పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు, వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆసుపత్రుల్లో సాధారణ సేవలతో పాటు అత్యవసర సేవలు మరింత పటిష్టంగా అందుబాటులోకి రానున్నాయి.

## ఎవరినీ వదిలిపెట్టం!

మొదటి పేజీ తరువాయి...

హెచ్చరించారు. గురువులపై దాడి చేసిన క్రిమినల్ గ్యాంగ్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. వాళ్ల భరతం పడతామని వార్నింగ్ ఇచ్చారు. అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం భ్రమ అని అన్నారు. అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రం, దేశ సత్తాను ప్రపంచానికి చాటిన క్రీడాకారులను స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు. జగన్ ఫేక్ ముఠా తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లు తమకు న్యాయం చేయాలంటూ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని మంత్రి తెలిపారు. క్రీడలతో దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో టీచర్ ఉద్యోగం సాధించిన స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ ఫ్యాక్షన్ ముఠా శాప్ కార్యాలయం వద్ద దాడికి దిగిందని మండిపడ్డారు. రౌడీ షీటర్లు, గంజాయి-బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. పూజించాల్సిన గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలన్నారు. వైసీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి-బ్లేడ్ బ్యాచుల పనిపడతామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.

## దాడులపై సీరియస్

(విజయవాడ - జయజయహే)

గురువులపై దాడి ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దాడిలో పాల్గొన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దని పోలీస్ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ఆదేశించారు. దీంతో కేసుల నమోదు, నిందితుల గుర్తింపు ప్రక్రియ వేగమైంది. సీసీటీవీ, వీడియో ఫుటేజ్ ఆధారంగా దాడిలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నేతలు, రౌడీషీటర్లను గుర్తిస్తున్న పోలీసులు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. మూకుమ్మడి దాడులు, నిబంధనల ఉల్లంఘన, అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించిన అంశాలపై మాచవరం, సూర్యారావుపేట, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు సమాచారం. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వీడియో ఫుటేజ్‌ను అధికారులు పరిశీలిస్తుండగా, ర్యాలీ, దాడుల్లో పాల్గొన్న రౌడీషీటర్లను వెంటనే అదుపులోకి తీసుకోవాలని విజయవాడ సీపీకి ఆదేశాలు వెళ్లాయి. మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి నగరాలకు చెందిన కొందరు రౌడీషీటర్లు దాడిలో పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. వైఎస్సార్సీపీ వర్గాలు కర్రలు, రాడ్లు, కోడిగుడ్లు, రాళ్లతో ముందస్తు ప్రణాళికతోనే దాడికి వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు, వీడియో ఆధారాలతో నిందితులపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇవాళ విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మెగా డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా టీచర్లు, వైఎస్సార్సీపీ నేతలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో వాటిని ఉపాధ్యాయులు ఖండిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ భరణికి వినతిపత్రాలు అందజేసేందుకు విజయవాడలోని శాప్ కార్యాలయం వద్దకు స్పోర్ట్స్ కోటా టీచర్లు వచ్చారు. అదే సమయంలో వైఎస్సార్సీపీ నేతలు కార్యాలయం బయట ధర్నాకు దిగారు. నిరసనకు పోలీసుల అనుమతి లేకపోయినా ఆ పార్టీ నాయకులు దేవినేని అవినాశ్, జోగి రమేశ్ నేతృత్వంలో పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్సీపీ శ్రేణులు, మద్దతుదారులు కార్యాలయాన్ని ముట్టడించారు. డీఎస్సీలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. దీంతో ఇటు టీచర్లు, అటు ఆ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు.

## శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి...

వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టుబట్టడంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాప్ ఆఫీసు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. విజయవాడలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో వైఎస్సార్‌సీపీ నేతలకు నిరసన తెలిపేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనవద్దని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు పోలీసులు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని నివాసానికి వెళ్లిన పోలీసులు ఆయనకు నోటీసులు అందజేశారు. సెక్షన్ 30 అమల్లో ఉన్నందున ఎలాంటి నిరసనలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

**ఆటలో గాయాల కంటే ఈ ఆరోపణలే ఎక్కువగా బాధిస్తున్నాయి..**

ఆంధ్రప్రదేశ్ మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన స్పోర్ట్స్ కోటా టీచర్లు విజయవాడలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 370 మంది టీచర్లు హాజరైన ఈ భేటీలో, రాజకీయ లబ్ధి కోసం తమను 'ఫేక్' అని అనడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటల్లో తగిలిన గాయాల కంటే ఈ అసత్య ప్రచారాలు తమ ఆత్మగౌరవాన్ని తీవ్రంగా గాయపరిచాయని పేర్కొన్నారు. కష్టపడి, ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన తమపై బురద జల్లవద్దని, ఇలాంటి దుష్ప్రచారాలను ప్రజలు, నిరుద్యోగులు నమ్మవద్దని కోరారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సాహార్థం స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకే టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉన్నత అధికారుల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకోండి

**సరైన నివేదికలే సమర్పించండి**

**నకిలీ వికలాంగుల సర్టిఫికెట్ల పై ఆరా తీస్తాం**

**ప్రభుత్వ పనులు అడ్డుకున్న వారిపై చర్యలు చేపట్టండి**

**మండల సమావేశంలో ఎమ్మెల్యే బండారు**

**మాడుగుల సెప్టెంబరు 21 జయ జయహే**



ప్రభుత్వానికి అందించాల్సిన నివేదిక విషయంలో పూర్తి విషయపరిజ్ఞానం అందుబాటులో లేకపోతే సంబంధిత ఉన్నతాధికారుల అభిప్రాయాలు తీసుకోవాలని అలాగే స్థానిక ప్రజాప్రతినిధులతో కూడా సంప్రదించాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజారాం అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖపై చర్చ జరిగినప్పుడు ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల నుంచి వ్యవసాయపరంగా కరువును గుర్తిస్తూ నివేదికలు సమర్పిస్తే ఒక మాడుగుల మండలం నుంచే సరైన నివేదిక అందలేదని ఆయన ఏవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదని తూతు మంత్రంగా ఉద్యోగం చేస్తే ఊరుకునేది లేదని ప్రజల సొమ్మును జీతాలు అందిస్తున్నారని చెప్పారు. ఇకనుంచి అలాంటి పరిస్థితులు ఎదురు కాకూడదని మండలంలో 19 పంచాయతీల్లో పూర్తిగా ఎల్ నీ నో ప్రభావం ఉందని మిగిలిన పంచాయతీల్లో కూడా అదే పరిస్థితి నెలకొందని అలాంటప్పుడు నివేదిక ఏ విధంగా ఉండాలని ప్రశ్నించారు. అధికారులు తమకు తెలియని విషయాలను ఎక్కడి నుంచి అయినా సరే ఉన్నత అధికారులతో పంచుకోవాలని సలహా ఇచ్చారు. మాడుగుల మండలంలో సరైన వర్షపాతం లేదని, జలాశయాలు నిండుకున్నాయని, చెరువులు ఎండిపోయాయని, రైతాంగం నిరాశతో ఉన్నారని అలాంటప్పుడు అధికారులు ఎలాంటి సాయం చేయాలని ప్రశ్నించారు. జలాశయాలు ఉంటే సరిపోదనే వాటిలో కావలసిన నీరు ఉండాలన్నారు. ఇక వికలాంగుల నకిలీ సర్టిఫికెట్లు విషయాన్ని మాజీ ఎంపీపీ వి రామధర్మజ పేర్లతో సహా బయటపెట్టి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ఆశ్చర్య పోయిన ఎమ్మెల్యే వెంటనే అలాంటి వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నకిలీ సర్టిఫికెట్లు ఒక ఉద్యోగి ద్వారా జారీ చేస్తున్నాడని గతంలో కూడా అతనిపై ఫిర్యాదు వెళ్లడం కేసు నమోదు అవ్వడం జరిగినప్పటికీ ఆయనలో మార్పు లేదని ఇతర ప్రాంతాలు చెందిన వారికి కూడా ఇలాంటి సర్టిఫికెట్లు అందజేస్తున్నారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎస్ఐని పిలిచి పెన్షన్ కోసం ఫేక్ సర్టిఫికెట్లు అందజేసిన వ్యక్తులను, వాటిని అందిస్తున్న వ్యక్తిని తీసుకురావాలని ఆదేశించారు. అలాగే కింతలి సెక్రటరీని కూడా పిలిచే వివరణ కోరగా వారికి వివిధ కారణాలు మూలంగా దరఖాస్తులు త్రోసి పుచ్చడం జరిగిందని తెలిపారు. అయితే వారు ఫేక్ సర్టిఫికెట్లు అందజేశారు అన్న విషయాన్ని పరిశీలించాలని చెప్పారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని వికలాంగుల పెన్షన్ విషయంలో 25% పైగా నకిలీలు ఉన్నట్టు గుర్తించి వాటిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. మాడుగుల మండలంలో కొత్తగా 1826 మంది పెన్షన్ కోసం దరఖాస్తు చేశారని వాటిలో 350 దరఖాస్తులు రోజు పుట్టినట్టు ఎండిఓ చెప్పారు. వికలాంగులు దరఖాస్తుపై కూడా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అయితే నకిలీ వికలాంగు సర్టిఫికెట్లు జారీ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి వెంటనే చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీపీ ధర్మజా డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ కాకుండా సీఎం సహాయనిధి చెక్కుల విషయంలో కూడా తప్పుడు పత్రాలు వస్తున్నాయని, విశాఖలో విశ్వం ఆసుపత్రి నుంచి ఇలాంటి నకిలీ దరఖాస్తులు అందుతున్నాయని ఆసుపత్రిని బ్లాక్లో పెట్టినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కే కోటపాడు దేవరపల్లి ప్రాంతాల నుంచి ఇలాంటి దరఖాస్తులు వస్తున్నాయని అయితే సంబంధిత పేరు గల వ్యక్తులకు తెలియకుండా జరుగుతున్నాయని చెప్పారు వాటిపై కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. అలాగే శంకరం పంచాయతీలో నిర్మిస్తున్న రహదారికి కొంతమంది వ్యక్తులు అడ్డు తగులు తగలడంతో పనులు నిలిచిపోయాయని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ ప్రభుత్వ పనులనే అడ్డుకునే ధైర్యం ఎక్కడుందన్నరు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసిల్దార్ను ఆదేశించారు. శంకరప్ప చేతిలో గల భూముల వివరాలు వాటిలో ప్రభుత్వ భూమి, బంజర భూమి, కౌలు భూమి, రైతుల సొంత భూముల వివరాలు తెలియజేయగలరు. తాసిల్దార్ మాట్లాడుతూ నెలకే రెండు గ్రామాల్లో రిసర్వ్ నిర్వహించి వారికి పాస్వర్డ్ అందజేస్తున్నామని మార్చి వరకు ఈ కార్యక్రమం కొనసాగుతాది అన్నారు. ఎంపీపీ రాజారాం మాట్లాడుతూ వెనుకబాట మాడుగుల మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని పాడేరు నుంచి పెనగాడి వరకు నిర్మించనున్న జాతీయ రహదారిని మాడుగుల మీదుగా నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని, ఈ మండలంలో గిరిజన ప్రాంతాలను ఐటిఐ పరిధిలో చేర్చాలని, మాడుగుల లో పాలిటెక్నికల్, ఐటీ ఐ వంటి కళాశాలలో ఏర్పాటు చేయాలని బొమ్మలిలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు జడ్పిటిసి కే రమణమ్మ మండల ఉపాధ్యక్షులు కే శ్రీనివాసు పి విజయలక్ష్మి ఎండిఓకే అప్పారావు తాసిల్దార్ కే రమాదేవి మాజీ ఎంపీపీ రామధర్మజ తో పాటు ఎంపిటీసీలు మిగిలిన సభ్యులు పాల్గొన్నారు



## పిఠాపురంలో పవన్ బిజీ..బిజీ!

తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి డాక్టర్ పీవీ చలపతిరావు, ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పవన్ కళ్యాణ్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వనంలో కొత్తగా ఏర్పాటు చేసిన సదుపాయాలను, ఉద్యానవనాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అటవీకరణ, జీవ వైవిధ్య పరిరక్షణపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను సందర్శించారు. పిఠాపురం పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా బటర్ ఫ్లై గార్డెన్, నమో వన్ ప్లాంటేషన్, చెరువు చుట్టూ మొక్కల పెంపకం, ఓపెన్ ఎయిర్ యాంఫీథియేటర్, గెజిబో, ఓపెన్ జిమ్, కెఫెటీరియా, వాకింగ్ ట్రాక్స్, ఎంట్రన్స్ ప్లాజాలను సుందరంగా సిద్ధం చేశారు. ఇది పిఠాపురం ప్రజలకు వ్యాయామం, విశ్రాంతితో పాటు పవిత్ర పాదగయ క్షేత్రానికి వచ్చే భక్తులకు హరిత ఆకర్షణగా నిలవనుంది.ప్రభుత్వ సహకారంతో పాటు వివిధ సంస్థల సామాజిక బాధ్యత నిధులు, ఏపీజీఈఎన్సీఓ భాగస్వామ్యంతో కాకినాడ జిల్లా అటవీ శాఖ ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. కేవలం మొక్కలు నాటడమే కాకుండా పర్యావరణహిత హరిత మౌలిక వసతులను సృష్టించి, విద్యార్థులకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించే బహిరంగ అభ్యాస కేంద్రంగా దీనిని అభివృద్ధి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పిఠాపురాన్ని మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా మార్చడంలో ఈ పీఠికాపుర వనం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పాడా పీడీ శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పిఠాపురానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నగరవనంలో ఆహ్లాదం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా తీర్చిదిద్దారు. అందులో ముఖ్యంగా నక్షత్రవనం, శివపంచాయతన వనం సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అటవీ శాఖ అధికారులు ఈ రెండింటి ప్రాధాన్యతను పవన్ కళ్యాణ్ కి వివరించారు. 27 నక్షత్రాలకు ప్రతీకగా నిలిచే ఉసిరి, మేడి, మోదుగ, కొండమామిడి, పిప్పలి, వెదురు, దేవదారు, పసన, జిల్లేడు, జమ్మి, రావి, మర్రి, జాతి జువ్వి, విప్ప, వేప తదితర రకాల మొక్కలను ఒక వరుస క్రమంలో నాటగా, ప్రతి మొక్కను ఆయన ఆసక్తిగా తిలకించారు. శివ స్వరూపమైన మారేడుతో పాటు వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్యభగవానుడి స్వరూపాలైన మొక్కలను శివ పంచాయతనంగా నాటారు. కార్తీక మాసంతోపాటు ప్రత్యేక దినాల్లో ఈ మొక్కలకు ప్రదక్షిణ చేయడం ద్వారా ఆయా దేవతల ప్రదక్షిణ పుణ్యం ప్రాప్తిస్తుందని, ప్రతి మొక్కకు శాస్త్రీయ నామం, వాడుకలో ఉన్న పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు.

అనంతరం 70 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్ను, బటర్ఫ్లై పార్కును, నగరవనం మధ్యన ఉన్న భారీ కొలనును పవన్ కళ్యాణ్ తిలకించారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలను పెంచుతూ వేగంగా పచ్చదనాన్ని అభివృద్ధి చేసే విధంగా మియావకీ పద్ధతిలో చిట్టడవిని చేశారు. బాక్స్ క్రికెట్, ప్లే కోర్ట్స్ లాంటి మరిన్ని ఆకర్షణలు నగరవనానికి జోడిస్తారు. పిఠాపురం ప్రజలతోపాటు ఆధ్యాత్మిక సందర్శనార్థం ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా నగర వనాన్ని తీర్చిదిద్దాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గతంలో డంపింగ్ యార్డు ప్రదేశం ఎలా ఉండేది? దాన్ని ఎంత కష్టపడి నగరవనంగా తీర్చిదిద్దారో వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పవన్ కళ్యాణ్ వీక్షించారు. ఈ సందర్భంగా పీఠికాపుర వనాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేసిన అధికారులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పలు నగర వనాలు అభివృద్ధి చేస్తున్నారు. రూ. 36 కోట్లతో ఏర్పాటు చేసిన 18 నగర వనాలను పవన్ కళ్యాణ్ ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.



## చెరుకూరికి ‘అమరజీవి సేవారత్న అవార్డు’

**విజయనగరం, సెప్టెంబరు 21 జయ జయహే,**

విజయనగరం జిల్లాలోని 58 ప్రాంతాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేసినందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి నాగరాజు కు ‘అమరజీవి సేవారత్న’ పురస్కారం లభించింది. జంగారెడ్డిగూడెంకు చెందిన ‘చిన్ని చారిటబుల్ ట్రస్ట్’ వ్యవస్థాపకులు చిన్ని రామసత్యనారాయణ ఈ అవార్డు ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల కోసం, ప్రత్యేకంగా ఆంధ్రరాష్ట్రం కావాలని చేసిన పోరాటం, త్యాగనిరతిని నేటితరానికి తెలియజేయడంలో విశేషకృషి చేసిన సందర్భంగా ఈ అవార్డును అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం విశాఖజిల్లా వడ్లపూడి లో జరిగిన ఆరుజిల్లాల ఆర్యవైశ్య సన్మానసభలో ఈ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సేవా సమితి ప్రోగ్రాం చైర్మన్ బండారు చంద్రశేఖర్, ముఖ్య సలహాదారు రవ్వా శ్రీనివాస్,ఉపాధ్యక్షులు డిమ్స్ రాజు, కోశాధికారి ఆరిశెట్టి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్సవాలకు టీడీపీ నేత కడిమి నాగేశ్వరరావు ఆర్థిక సాయం

**దేవరాపల్లి, సెప్టెంబర్ 21, జయ జయహే :**

మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువతను ప్రోత్సహించడంలో భాగంగా టీడీపీ నాయకులు కడిమి నాగేశ్వరరావు వినాయక వేడుకల కోసం రూ. 5,000/- ఆర్థిక సహాయాన్ని విరాళంగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వినాయక చవితి వేడుకలను ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు, నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత నారా లోకేష్ బాబు ఉచిత అనుమతులు, ప్రత్యేక సడలింపులు కల్పించారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి

**చోడవరం సెప్టెంబర్ 21 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం మహాకవి, నవయుగ వైతాళికుడు, సామాజిక సంస్కర్త శ్రీ గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ జ్యోతి గురజాడ అప్పారావు జీవితశీ, అతను తెలుగు సాహిత్యానికి చేసిన సేవను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ మల్లిబాబు , రామకృష్ణ , డాక్టర్ రాజ్ కుమార్ , డాక్టర్ ఎస్ సూర్యవతి , మాల్యాద్రి పిచ్చమ్మ , నారాయణ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు గురజాడ అప్పారావు జీవితం, సాహిత్య సేవలు, సామాజిక సంస్కరణ భావాల గురించి ప్రసంగించారు. సమన్వయకర్త రాజేశ్వరరావు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి.మాల్యాద్రి, బి. పిచ్చమ్మ, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ మల్లీబాబు, సీనియర్ అధ్యాపకులు ఎంవి రామకృష్ణ, డాక్టర్ రాజ్ కుమార్, వెంకటేష్,డాక్టర్ పద్మావతి, డాక్టర్ లక్ష్మి మంగమ్మ, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ షర్మిలశ్రీ, రామలక్ష్మి, కోమల, హేమ గణేష్, పిడి గణేష్, ఆఫీసు సూపర్నెంట్ రమేష్, లక్ష్మీనారాయణ ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గ్రామాల్లో ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనందదాయకం

**మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు**

**దేవరాపల్లి, సెప్టెంబర్ 21, జయ జయహే :**

తెలుగు సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకగా వినాయక నవరాత్రి ఉత్సవాలను గ్రామాలలో ఐక్యంగా నిర్వహించడం ఆనందదాయకమని మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని అల్లిపురం, స్థానిక బీరకవీధి డైనమిక్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వినాయకుడిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ డిప్యూటీ సిఎం ముత్యాల నాయుడును ఘనంగా సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పల వెలమ కార్పోరేషన్ రాష్ట్ర మాజీ డైరక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలం నాయుడు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, వేచలపు అప్పలనాయుడు, జాగరపు వెంకటరావు, చొక్కాకుల రమణ, వరదపురెడ్డి అప్పలనాయుడు, కొరుపోలు శ్రీను, గంగవంశం సంతోష్, అల్లు రాము, వాణి, రమణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవం

**దేవరాపల్లి, సెప్టెంబర్ 21 జయ జయహే :**



దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం వేడుకలు ప్రిన్సిపాల్ బి.రాధ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి . ఈ సందర్భంగా హిందీ అధ్యాపకురాలు ఎస్. నిర్మల మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ సభ హిందీని భారత కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తించిందన్నారు. విద్యార్థుల్లో హిందీ భాష పై అవగాహన పెంపొందించే విధంగా హిందీలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఎంపీసీ గ్రూప్ నుంచి సిహెచ్. సాగర్, వై. మౌనిక, హెచ్ ఈ సి గ్రూప్ నుంచి సిహెచ్. జ్యోతి, బైపీసీ గ్రూప్ నుంచి కె. మౌనిక హిందీ పరీక్షల్లో 100కి 99 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబర్చిన ఈ విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.రాధ చేతుల మీదగా అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందంపాల్గొన్నారు.



## ఘనంగా గురజాడ జయంతి వేడుకలు

**మాడుగుల సెప్టెంబర్ 21 జయ జయహే**

ప్రజాకవి గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలు సోమవారం మాడుగులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టీవీ రాజారాం, ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, ఎండి ఓకే అప్పారావు, తాసిల్దార్ కే రమాదేవి, జడ్పిటిసి కే రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కే శ్రీనివాసు, పి విజయలక్ష్మి మాజీ ఎంపీపీ వి రామధర్మజ, ఎంపిటీసీలు మాజీ సర్పంచులు కూటమి నాయకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయంపై వివాదం

## అరకులో పారదర్శక కేటాయింపులు చేపట్టాలని స్థానికుల డిమాండ్

**అరకులోయ, సెప్టెంబర్ 21 జయ జయహే:**

అరకు వేలి మండలంలో పంచాయతీ నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయం వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ స్థలంలో ప్రజా నిధులతో నిర్మించిన ఈ సముదాయంలోని దుకాణాల కేటాయింపు, నిర్మాణ వ్యయం, అనుమతులు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానిక నిరుద్యోగులు, ప్రజా సంఘాలు కోరుతున్నారు.ప్రజా అవసరాల కోసం నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని కొందరికి అనుకూలంగా కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విచారణ నివేదికలోని వివరాలు బహిర్గతం కాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆస్తిపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని, దుకాణాల కేటాయింపులో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శక విధానం పాటించాలని వారు కోరుతున్నారు. ముఖ్యంగా స్థానిక



గిరిజన నిరుద్యోగులకు ప్రాధాన్యం కల్పిస్తూ, ఐటీడీఏ ఆధ్వర్యంలో బహిరంగ లాటరీ లేదా నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణానికి ఖర్చు చేసిన నిధులు, దుకాణాల సంఖ్య, కేటాయింపు నిబంధనలు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై అధికారులు స్పందించి సమగ్ర వివరాలను ప్రజల ముందుంచాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.



## అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన

**ముంచంగిపుట్టు, జయ జయహే**

స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. అనంతరం మండపం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అల్లూరి యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్న సమారాధన కార్యక్రమంతో నాలుగు రోడ్ల కూడలి పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే. ధర్మారావు, ఎస్ఐ పి. నాని వైసీపీ పార్టీ యువజన విభాగం జిల్లా నేత జల్లిపల్లి మూర్తి, సీనియర్ నేత ఎండీ. సులేమాన్, అల్లూరి యూత్ ప్రతినిధులు పి. మురళి, ఎస్.గణపతి, జి. రాజు, వి. గణేష్, ఎస్. సురేష్, ఎం శంకర్రావు, జి. ఉదయ్, ప్రజా ప్రతినిధులు, వర్తక సంఘం ప్రతినిధులు, వర్తకులు, తదితరులు పాల్గొన్నారు.



## కొయ్యూరులో ఘనంగా నమామి భారతం - వందేమాతరం కార్యక్రమం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 22,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం నమామి భారతం - వందేమాతరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు విజ్ఞాన భారతి ఆఫ్ బీవీకే ప్లే స్కూల్ కరస్పాండెంట్ మేడిబోయిన చక్రరావు (చిన్న), ప్రిన్సిపల్ అనంతలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులచే వందేమాతరం సామూహిక గేయాలాపన చేయించనున్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని పెంపొందించడం, వందేమాతరం గేయం చారిత్రక ప్రాముఖ్యతను, స్వాతంత్ర్య ఉద్యమంలో దాని పాత్రను యువతకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, దేశభక్తి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.




## అరకు వేలి ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

**అరకులోయ, సెప్టెంబర్ 21. జయ జయహే,**

అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం ఎంతో గొప్ప సేవ అని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. అరకు వేలి ఏరియా ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో అరకు వేలి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పాంగి అప్పన్న( అప్పు, ) డుంబ్రిగుడ మండల జనసేన పార్టీ ఐటీ ఇన్‌చార్జి గుజ్జెల రమేష్,అరకు అరకు వేలి మండల వీర మహిళ దామసింగి దివ్య,కోర్ కమిటీ మెంబర్ యెరుబంటి ప్రవీణ్ కుమార్, జనసేన యూత్ మెంబర్స్ పూజారి సింహాద్రి, ప్రవీణ్, సి బోయిన జానీ బాబు, తదితరులు రక్తదానం చేశారు. వీరితో పాటు మొత్తం ఏడుగురు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తానికి ప్రత్యామ్నాయం లేదని వారు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక యూనిట్ రక్తం ఒకరి ప్రాణాలను కాపాడే అమూల్యమైన ప్రాణాధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మన కోసం కాదు మనతోటి మనిషి ప్రాణం కోసం అనే సందేశంతో నిర్వహించిన ఈ రక్తదాన కార్యక్రమం మానవత్వానికి ప్రతీకగా నిలిచిందని వారు పేర్కొన్నారు.



## వైస్ ఎంపీపీ భాగ్యవతి చొరవతో గ్రామాలకు కొత్త విద్యుత్ స్తంభాలు

**ముంచంగిపుట్టు, జయ జయహే**

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం లభించింది. మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు సిరగం భాగ్యవతి చొరవతో విద్యుత్ శాఖ అధికారులు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ పనులను వైస్ ఎంపీపీ పరిశీలించారు. వనుగుమ్మ పంచాయతీ పరిధిలోని దొమినిపుట్, కిరంభో, వనుగుమ్మ, ఆసరాడ తదితర గ్రామాల్లో పాత విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి, వర్షాకాలంలో పడిపోయే ప్రమాదం నెలకొంది. ఈ సమస్యను గత నెల ఆగస్టు 27న గ్రామస్తులు భాగ్యవతి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖకు, సమస్య పరిష్కారానికి చొరవ చూపిన వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం దిశగా ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన సాగర్‌తో పాటు వైసీపీ కార్యకర్తలు సిద్దేశ్, గణపతి, బుద్దు, పూర్ణరావు, రామమూర్తి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## కంతారం పంచాయితీలో పీజీఆర్ఎస్.. 29 ఫిర్యాదులు..

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 22**

కొయ్యూరు మండలం కంతారం గ్రామ సచివాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మొత్తం 29 ఫిర్యాదులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 28 ఫిర్యాదులు, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించి 1 ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు.




## గుంటసీమ నుంచి కుజబంగి వరకు నూతన బస్సు సర్వీసు ప్రారంభం

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 21. జయ జయహే.**

డుంబ్రిగూడ మండలం, గుంటసీమ నుంచి కుజబంగి వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, అరకు టీడీపీ పార్టీ ఇన్చార్జ్ సియ్యారి దొన్నుదొర సోమవారం ప్రారంభించారు. పాడేరు నుంచి అరకు-గుంటసీమ మీదుగా కుజబంగి వరకు ఈ సర్వీసు నడుస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని దొన్నుదొర పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు గిరిజన ప్రాంతాలు రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తూనే మరోవైపు త్రాగునీటి రవాణా తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు, అనంతరం దొన్నుదొర ప్రయాణికులతో కలిసి నూతన బస్సులో కొంత దూరం ప్రయాణించారు, ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి శెట్టి చిరంజీవి, మాజీ మండలాధ్యక్షులు సుబ్బారావు, మండల అధ్యక్షులు కిల్లో ఆనందరావు, మండ్యా గురు స్వామి, పాంగి సుబ్బారావు, రవి, స్వామి, కొమ్ములు నాయుడు, తడబరికి చిన్నగేన్ను, మూర్తి, విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి కొన్నేడి లక్ష్మణ్ రావు, బంగురు రామదాసు, కే అనూష, ధన్నేష్, కొర్ర నాగరాజు, దామోదర్, గంగాధర్, అడ్డకట్ల సుబ్బారావు, దాన్నే రావు, బాబురావు, సిద్దు, నరేష్, సింహాద్రి, జక్కయ్య, వెంకటరావు, జన్ని బాలరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు,




## పోగొట్టుకున్న ఆభరణాలు బాధితురాలికి అందజేత

**విజయనగరం జయజయహే**

పోయిన బంగారు ఆభరణాలపై దర్యాప్తు జరిపి విజయనగరం గ్రామీణం పోలీసులు బాధితురాలికి అందజేసారు . సోమవారం విజయనగరం గ్రామీణం 'సిఐ బి.లక్ష్మణరావు అందించిన సమాచారం ప్రకారం విజయనగరం మండలం జొన్నవలసకు చెందిన పిన్నింటి పైడిరాజు (65 సం.లు) సెప్టెంబరు 20న వి.టి.అగ్రహారంలో బంధువుల ఇంటిలో బారసాల కార్యక్రమానికి వెళ్ళేందుకుగాను జొన్నవలసలో ఆటో ఎక్కారు. కొంత దూరం ప్రయానించాక తన చేతి బ్యాగులో 5 తులాల బంగారు ఆభరణాలు (పుస్తుల త్రాడు, రెండు పేటల గొలుసు, చెవి దిద్దులతో) గల చిన్న మనీ పర్సు, కీ-ప్యాడ్ ఫోను పోయినట్లుగా గుర్తించారు. తన కుమారుని సహాయంతో విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ వి.వర ప్రసాద్ మరియు కానిస్టేబుల్ సూర్య విచారణ చేపట్టి, పోయిన బంగారు ఆభరణాలు గల మనీ పర్సు, అందులోగల బంగారు ఆభరణాలను సాంకేతిక ఆధారాలతో కనుగొన్నారన్నారు. అనంతరం, బాధితురాలిని కబురు చేసి, సెప్టెంబరు 21న రూరల్ సర్కిల్ కార్యాలయంలో వాటిని అందజేశారు. పోగొట్టుకున్న తమ వస్తువులు తిరిగి పొందడంతో వారి కుటుంబ సభ్యులు అందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.సమర్ధవంతంగా విదులు నిర్వర్తించిన రూరల్ ఎస్ఐ వర ప్రసాద్, కానిస్టేబుల్ సూర్య సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ ఎఆర్ దామోదర్ అభినందించినట్లుగా సిఐ తెలిపారు.



## పాత్రికేయుడు, గాయకుడు కోవెలకు ఘన సన్మానం

**చోడవరం, సెప్టెంబర్ 21 జయ జయహే**

చోడవరానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ గాయకుడు కోవెల శ్రీనివాసును ఆదివారం రాత్రి స్థానిక స్వయంభు కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయ సన్నిధిలో పలు సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కోవెల శ్రీనివాసు బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాల ఆలాపన కార్యక్రమం భక్తులను అలరించింది.ఈ సందర్భంగా భక్తి గీతాలను ఆలపించిన కోవెల శ్రీనివాసును పలువురు ప్రముఖులు, పాత్రికేయులు, రాజకీయ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చోడవరం జర్నలిస్ట్స్ ఫోరం సభ్యులు ఓరుగంటి రాంబాబు, దేవరపల్లి నవకుమార్, డి.వి.ఎం. నాయుడు, ఎం. రాజగోపాల్, చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. అప్పలరాజు, జనసేన నాయకుడు కర్రి రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ మంగా శ్రీనివాసరావు, శ్రీరామపట్నం, సీపీఐ నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు, యోగా గురువు పుల్లేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు. భక్తి గీతాల కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. గాయకుడు కోవెల శ్రీనివాసు ఆలపించిన భక్తి గీతాలను భక్తులు ఆసక్తిగా ఆలకించారు.

For a pure tomorrow.. జయహో



## మిట్టకండ్రిగ, రైల్వే స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సులు నిలపాలి

### ప్రయాణికుల ఇబ్బందులు పరిష్కరించాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21, జయ జయహే**

శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ బస్సులను శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ ప్రాంతాల్లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రేవతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారని తెలిపారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, తిరుపతికి వృత్తి, వైద్యం, విద్య తదితర అవసరాల కోసం వెళ్లే ప్రజలు ఆర్టీసీ బస్సులు ఆయా ప్రాంతాల్లో నిలపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ వద్ద బస్సులు నిలపకపోవడం వల్ల ప్రయాణికులు సమయం వృథా చేసుకోవడంతో పాటు తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించి ఆయా ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌ను కోరారు. దీనిపై డిపో మేనేజర్ రేవతి సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగూరయ్య, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## సూపరింటెండెంట్‌కు ఎన్ఎస్ఎఫ్ వినతి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21, జయ జయహే**

శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవల పథకానికి సంబంధించిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నవ సమాజ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఎన్ఎస్ఎఫ్ జాతీయ వ్యవస్థాపకులు నీరుగట్టు నగేష్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు తలారి సూరిబాబు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్యసేవల పథకానికి సంబంధించి సుమారు రూ.32 లక్షలకు పైగా ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్నందున సమగ్రంగా పరిశీలించాలని కోరారు. దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పటిష్టమైన పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని, లేనిపక్షంలో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఎన్ఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు నీల విజయభాస్కర్, తిరుపతి జిల్లా అధ్యక్షులు మాయారి వెంకటేశులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పెనుబాకు కామేశ్వరి, బీఎన్ కండ్రిగ మండల అధ్యక్షులు వెలిగారం కృష్ణమూర్తి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గురజాడ అభ్యుదయ దార్శనికుడు

**విజయనగరం :(జయ జయహే)**

మహాకవి గురజాడ అప్పారావు గొప్ప సంఘ సంస్కర్త, ఆధునిక అభ్యుదయ వాది అని జనసేన నాయకులు గురాన అయ్యలు , రాధిక పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని గురాజాడ స్వగృహంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ సమాజానికి గురజాడ చేసిన సేవలను కొనియాడారు. తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చారని, ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గురాన రాధిక మాట్లాడుతూతోటి వారికి సహాయాన్ని అందించాలని గురజాడ చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఆయన ఆశయాలను భావి తరాలకు అందించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు రవీంద్ర, పిడుగు సతీష్ , పి.అప్పలరాజు, టి.శ్రీనివాస్ , డి.రాము, కె.సతీష్ ,కె.రాజేష్ , భాను, పుష్ప,చక్రవర్తి, సాయి, రాంబాబు, పవన్ కుమార్ ,ఎస్ .రాజేష్ తదితరులు పాల్గొన్నారు



## తెలుగు సాహిత్యానికి మార్గదర్శి గురజాడ

### ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా జయంతి వేడుకలు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21, జయ జయహే**

శ్రీకాళహస్తి సామాన్య ప్రజల అభివృద్ధి, సామాజిక చైతన్యమే లక్ష్యంగా గురజాడ అప్పారావు తన రచనలు సాగించారని, ఆధునిక తెలుగు సాహిత్యానికి ఆయన గొప్ప మార్గదర్శిగా నిలిచారని ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గంగారాం పేర్కొన్నారు. మహాకవి గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తిలోని ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాలలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ టి. గంగారాం మాట్లాడుతూ పండిత భాషకు బదులుగా ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషలో గురజాడ రచనలు చేశారని తెలిపారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ కే. సుబ్బారావు మాట్లాడుతూ గురజాడ రచించిన ప్రసిద్ధ దేశభక్తి గేయం తెలుగు ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవతా భావాలను పెంపొందించిందని తెలిపారు. గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను, సామాజిక అసమానతలను గురజాడ తన రచనల ద్వారా ప్రశ్నించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సామూహికంగా దేశభక్తి గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కే. సుబ్బారావు, టి. నరసింహులు, డాక్టర్ కే. సాయి వెంకటేష్, డాక్టర్ సి. బాపనయ్యతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




## సాలూరులో మెడికల్ షాపులపై ఈగల్ టీం దాడులు

**సాలూరు జయజయహే**

ఆపరేషన్ గరుడలో భాగంగా సాలూరు పట్టణంలోని మెడికల్ షాపులను ఈగల్ టీం అధికారులు తనిఖీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. యుగంధర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈగల్ బృందం, సాలూరు టౌన్ ఎస్సై, పోలీస్ సిబ్బందితో కలిసి శివ సాయి మెడికల్స్, అపోలో మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టింది. ఆయా షాపుల్లో విక్రయిస్తున్న చీ=శ మందులు, వాటికి సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. శివ సాయి మెడికల్స్‌లో చీ=శ మందుల విక్రయాలకు సంబంధించిన రికార్డులు, పత్రాలు సక్రమంగా లేకపోవడంతో షాపు యజమాని నుంచి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వివరణ కోరారు. అనంతరం మెడికల్ షాపుల యాజమాన్యాలకు మాదకద్రవ్యాల నియంత్రణ, నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఐజీపీ ఆకే రవికృష్ణ ఈగల్ ఐజీపీ ఎన్. మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు

## గురజాడ అప్పారావుకు కలెక్టర్ నివాళులు

### తెలుగు సాహిత్యానికి, సామాజిక సంస్కరణలకు విశేష సేవలు

**తిరుపతి, సెప్టెంబర్ 21, జయ జయహే**



తిరుపతి మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్ఓ నరసింహులు, ఏఓలతో కలిసి కలెక్టర్ గురజాడ చిత్రపటానికి పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య అభివృద్ధికి, సామాజిక సంస్కరణలకు గురజాడ అప్పారావు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో చైతన్యం, మానవతా విలువలను పెంపొందించేందుకు గురజాడ అందించిన సందేశం నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. గురజాడ రచనలు సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయని తెలిపారు. ఆయన సాహిత్య సేవలను స్మరించుకోవడం, ఆయన ఆశయాలను సమాజంలో ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.




## ఉపాధ్యాయులపై దాడులు జగన్ ప్రేరేపితమే

### టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21, జయ జయహే**

శ్రీకాళహస్తి: విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై జరిగిన దాడులు వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రేరేపితమేనని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై రాళ్లు, రాడ్లు, కోడిగుడ్లతో దాడికి పాల్పడటం, అసభ్యకరంగా మాట్లాడటం సరికాదన్నారు. క్రీడాకారులు ఎన్నో ఏళ్లుగా కఠోర సాధన చేసి సాధించిన పతకాలు, సర్టిఫికెట్లను కించపరిచేలా ఆరోపణలు చేయడం తగదన్నారు. మెగా డీఎస్సీ-2025లో క్రీడా కోటా కింద ప్రతిభ ఆధారంగా ఎంపికైన క్రీడాకారులపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. క్రీడాకారుల కృషిని, ప్రతిభను గౌరవించాలని, ఉపాధ్యాయులకు జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తంగేళ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ బీమాల భాస్కర్, డి.వి.నారాయణ, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి, పూల శేఖర్, శంకరయ్య, గంగనపల్లి రమేష్, సులేమాన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




## రోలుగుంటలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు

**చోడవరం సెప్టెంబర్ 21 జయ జయహే**

చోడవరం నియోజకవర్గ పరిధిలో గల రోలుగుంట పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ సాహితీవేత్త, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలతో పాటు, సమాజంలోని మూఢాచారాలు, సామాజిక దురాచారాల నిర్మూలనకు చేసిన కృషిని వివరించారు. తెలుగు ఉపాధ్యాయులు సోమరాజు, సునీత గురజాడ అప్పారావు రచనల్లోని ప్రత్యేకమైన భాషా శైలి, సరళమైన వ్యావహారిక భాషను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పాత్రను వివరించారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి.వి.ఎం. నాగజ్యోతి గురజాడ అప్పారావు చేసిన సంఘసంస్కరణలను వివరిస్తూ, సతీసహగమనం, కన్యాశుల్కం వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా వివిధ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని గురజాడ అప్పారావు సాహిత్య, సామాజిక సేవలను స్మరించుకున్నారు.




## నడింపాలెంలో రైతులకు విత్తన గుళికల తయారీపై అవగాహన..

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 22**

కొయ్యూరు మండలం నడింపాలెం గ్రామంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగుకు నోచుకోని పొలాల్లో విత్తన గుళికల తయారీ విధానంపై వ్యవసాయ శాఖ మరియు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. వర్షం రాకముందే ఈ గుళికలను తయారు చేసి పొలంలో చల్లుకుంటే, వర్షం పడిన వెంటనే అవి మొలకెత్తి సమయం కలిసి వస్తుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. శివ రామ ప్రసాద్, మండల ప్రకృతి వ్యవసాయ విభాగం బాధ్యులు శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు లోవలక్ష్మి, గ్రామ సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21, జయ జయహే**

శ్రీకాళహస్తి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి, శ్రీకాళహస్తీశ్వర స్వామివారి, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఏపీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.



## వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు ఏడు వినతులు

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగిన ప్రజాదర్బార్‌లో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయా విభాగ అధికారులకు ఆయా వినతులను అందజేసి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతీ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మొత్తం 7 వినతులురాగా, వాటిలో ప్లానింగ్ విభాగానికి సంబంధించి 5, ఎస్టేట్ విభాగానికి సంబంధించినవి 2 చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి రుషిబాబు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాలు పంపిణీ:

**టిడిపి పార్టీ అరకు ఇన్చార్జి దొన్ను దొర**

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 21. జయ జయహే,**



మండలంలోని కొర్రాయి పంచాయితీ పరిధిలోని పెద్ద అంజోడలో సోమవారం జరిగిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోనల్ ఛైర్మన్, అరకు టీడీపీ ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర పాల్గొన్నారు. రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆఫీసుల చుట్టూ తిరిగే బాధలు తప్పించి నేడు అధికారులనే రైతుల ఇళ్ల వద్దకు పంపి పుస్తకాలు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆదరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులను మోసం చేయాలన్న దురుద్దేశంతోనే గతంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ని తీసుకొచ్చారన్నారు, ఈ చట్టంతో రైతులంతా భయపడిపోయారని, అన్నదతల ఆందోళన గమనించిన రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు అన్నదతాల ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్న ఉద్దేశంతో, తాను అధికారంలోకి వస్తే జగన్ ఫోటోను పాస్ పుస్తకాల్లో తొలగించి రైతుల ఫోటోలతో రాజముద్రలతో అందజేస్తామని చెప్పినా మాటకు కట్టుబడి ఈరోజు అందిస్తున్నారన్నారు, రెవెన్యూ అధికారులే రైతుల వద్దకు వెళ్ళి పాస్ పుస్తకాలు అందించే పరిస్థితి చరిత్రలో ఎప్పుడు చూడలేదు అన్నారు, అది కూటమి ప్రభుత్వం లోనే సాధ్యమైంది అన్నారు, రాబోయే స్థానిక ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజాల సహకరించాలని ఇప్పుడు గ్రామంలో మరింత అభివృద్ధి చేసుకున్నందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు, కూటమికి అండగా నిలిస్తే ప్రజలకు నాయకులు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన అన్నారు, గతంలో పాస్ పుస్తకాలు తీసుకోవాలంటే రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి విముక్తి లభించిందని కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి తీసుకున్నా నిర్ణయంతో అధికారులు రైతుల వద్దకు వచ్చి పాస్ పుస్తకాలు ఇస్తున్నారన్నారు, గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించాలని మీకోసం ఏ ప్రభుత్వం పని చేస్తుందో ఆలోచన చేయాలన్నారు, రైతు బాగుండాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఆలోచనలు అన్నారు, ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి శెట్టి చిరంజీవి, మాజీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, మండల అధ్యక్షులు ఆనందరావు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి కొన్నేడి లక్ష్మణ్ రావు, బంగురు రామదాసు, నాయకులు తదితరులు పాల్గొన్నారు,



## బాణాసంచ తయారీ కేంద్ర్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా అదే ఒకసారి మేరకు సోమవారం బాణాసంచా తయారీ నిల్వ కేంద్రాలలో అనకాపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బాణాసంచా తయారీ కేంద్రాల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది ఈ తనిఖీలు అనకాపల్లి టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ అనకాపల్లి రూరల్ సర్కిల్ సీఐ అశోక్ కుమార్ రూరల్ ఎస్సై రవికుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది ముఖ్యంగా అనకాపల్లి టౌన్ పరిధిలోని గవరపాలెం తోటాడ పరిసర ప్రాంతాలతో పాటు రూరల్ పరిధిలో రాజుపాలెం వల్లూరు గ్రామాల్లో బాణాల సంజాత గారి కేంద్రాల గోదాములు అధికారులు పరిశీలించడం జరిగింది . నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు భద్రతా ప్రమాణాలు అగ్నిమాపక పరికరాలు లైసెన్సుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది . ప్రజల ప్రాణ ఆస్తి భద్రత దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపర గా కఠిన చర్యలు తీసుకుంటాం ఎలాంటి అనుమతులు లేకుండా ఎల్ల మధ్యలో గానీ జనవాసాల్లో గాని బాణాసంచా తయారు చేసిన అక్రమంగా నిలువ ఉంచిన లేదా అమ్మకాలు చేపట్టిన వారిపై చట్ట ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు ప్రభుత్వం నుంచి అధికార అనుమతులు లైసెన్స్ పొందిన తయారీ నిల్వ కేంద్రాల నిర్వహకులు తప్పనిసరిగా నిర్దేశిత భద్రత ప్రమాణాలు నిబంధనలు పాటించాలని బాణాసంచా నిల్వ కేంద్రాల వద్ద అగ్నిమాప పరికరాలు అందుబాటులో ఉంచుకోవడంతోపాటు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలే రక్షణ మా ప్రథమ ప్రాధాన్యం అణాధికారిగా బాణాసంచ నిలువ ఉంచిన లేదా విక్రయాలు జరిపిన ప్రజలు డయల్ 112 డయల్ చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలియజేశారు

## కార్మిక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధం కావాలి

**అనకాపల్లి జయ జయహే**



కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమ పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటియుసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు సోమవారం సిపిఐ పొడగంటి గోవిందరావు భవనంలో జిల్లా ఆర్గనైజ్ ప్రెసిడెంట్ జి. యేసుదాసు అధ్యక్షతన జరిగిన కార్మికుల ఉద్యోగుల సదస్సుల ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు కోడులుగా తీసుకురావడం వల్ల కార్మిక హక్కుల హరించబడ్డాయని ఎనిమిది గంటల పని దినం 12 గంటలు చేరిందని ఈ కోడ్స్ కారణంగా సంగం పెట్టుకునే హక్కును కూడా కార్మికుల కోల్పోయారని మహిళా కార్మికులకు రక్షణ లేదన్నారు సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉ ద్యోగులు కల్పిస్తామన్న ప్రధాని మోడీ హామీ గాల్లో కలిసిపోయిందని కొత్త ఉద్యోగాలు మాటేమో గానీ ఉన్న ఉద్యోగాలు తీసివేస్తున్నారని ఆయన విమర్శించారు కార్మికుల చేస్తున్న ధర్నాలను ఆందోళనను పోలీసులు ఉక్కు పాదాలతో అణిచివేస్తున్నారని కార్మికులు ఉ ద్యోగులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజన్న దొరబాబు మాట్లాడుతూ జిల్లాలో మూసివేసిన నాలుగు షుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం ఖర్చుతో ఆధునికరించి రైతుల భాగస్వామ్యంతో సహకార రంగంలో నడిపించాలని వారు డిమాండ్ చేశారు ఈ సదస్సులో ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్గనైజ్ ప్రెసిడెంట్ జై యేసుదాసు ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ సహాయ కార్యదర్శి గండిపల్లి త్రినాథ్ భవన నిర్మాణ కార్మికులు ఆర్టీసీ రెగ్యులర్ మరి రిటైర్ కార్మికులు మిల్క్ సొసైటీ ఉద్యోగులు అల్యూమినియం వర్కర్స్ ఆటో మోటార్ కార్మికులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు




## ఘనంగా నిర్వహించిన లక్ష్మీ గణపతికి విశేష పంచామృతాభిషేకం

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక బెల్లం మార్కెట్ ఆవరణలో నెలకొని ఉన్న లక్ష్మీ గణపతి ఆలయంలో శ్రీ వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల పురస్కరించుకుని స్వామివారి ఉత్సవాలు అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక వాతావరణంలో గణపతి మాల ధరించిన భక్తులు 120 మంది నిత్యం పాల్గొని స్వామి వారి విశేష అభిషేకంలో పాల్గొనడం జరుగుతున్నది సోమవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు గంధాభిషేకం భస్మాభిషేకం కుంకుమ జలాభిషేకం పసుపు జలాభిషేకం సుగంధ ద్రవ్యాల జలాభిషేకం అత్యంత విశేషంగా నిర్వహించడం జరిగింది . అభిషేకం జరుగుతున్నంతవరకు మాలాధారణ ధరించిన గణపతి భక్తులు ఆయన నామస్మరణంతో దేవాలయం ప్రాంగణం మారు మోగింది పూజా అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అనంతరం అన్నదాన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో మాలాధారణ భక్తులు స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారుద



## అరకు వేదికగా సైన్స్ యుగపు సమాజ్ పార్టీ ఆవిర్భావం

**అరకులోయ: సెప్టెంబర్ 21 జయ జయహే.**

విశ్వశాంతి దినాన్ని పురస్కరించుకొని వేదికగా సైన్స్ యుగపు సమాజ పార్టీ ఎస్ ఎస్ పి అధికారికంగా ఆవిర్భవించింది. అరకు వేలి మండల కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ ప్రారంభ సైన్స్ యుగపు సమాజ పార్టీ వేడుకకు పార్టీ జాతీయ అధ్యక్షులు మిస్టర్ యూనివర్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో శాంతికి నిలయంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పార్టీ విధివిధానాలను నాయకులు ప్రకటించారు. మిస్టర్ యూనివర్స్ మాట్లాడుతూ సమాజం సైన్స్ యుగంలోకి అడుగుపెడుతున్న తరుణంలో కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజలను విభజించుకోవడం అజ్ఞానమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్రారంభంలో ప్రజల హాజరు స్వల్పంగా ఉన్నప్పటికీ, తమ గొప్ప ఆశయాలను ముందు ముందు ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు.

**పార్టీ ప్రధాన విధివిధానాలు మేనిఫెస్టో ముఖ్యాంశాలు:**

దేశాలు, ప్రాంతాలు, జాతుల మధ్య విభేదాలు లేని విశ్వ సమాజ స్థాపన. సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం ప్రతి పౌరునికి స్వేచ్ఛా జీవితం. కులమతాలు లేని సమాజం, భూమిని జాతీయం చేయడం వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయడం. ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డతో పాటు ఉపాధి, రక్షణ సామాజిక భద్రత కల్పించడం. దోపిడీ, పీడన లేని సమాజ నిర్మాణం కామన్ సివిల్ కోడ్ ఏర్పట్లన్నీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలుకు చెందిన జాతీయ ప్రధాన కార్యదర్శి జె.వి. కృష్ణయ్య, ప్రకాశం జిల్లాకు చెందిన రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం. రావు, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోలీసులు ప్రజల మధ్య విశ్వాసం బలోపేతం కావాలి

**సమస్యల పరిష్కారమే ప్రజల విశ్వాసానికి మూలం**

**పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పి మాధవ్ రెడ్డి**

**పార్వతీపురం మన్యం జిల్లా జయజయహే**

పోలీస్ ప్రజల మధ్య పరస్పర విశ్వాసాన్ని బలోపేతం కావాలని , అందుకు ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి పేర్కొన్నారు . జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రా+=వా) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భూ, ఆస్తి వివాదాలు, కుటుంబ సమస్యలు, వేధింపులు, మోసాలు తదితర అంశాలపై ప్రజల నుండి మొత్తం 14 ఫిర్యాదులు అందాయి. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరమైన నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, అర్హత ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ జి.ఏ.వి. రమణ, ఎస్సై శిరీషతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లాలో 100% 'ఈ-ఆఫీస్' అమలు కావాలి

**పరిపాలనలో అలసత్వం వహిస్తే సహించేది లేదు**

**అధికారుల టూర్ వివరాలు వాట్సాప్‌లో పంపాల్సిందే**

**ప్రతికూల వార్తలపై తక్షణ వివరణ ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి**

**పార్వతీపురం మన్యం జయజయహే**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా పరిపాలనలో 'ఈ-ఆఫీస్' నిర్వహణ తప్పనిసరి అని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని అధికారులను కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల వారీగా ఫైళ్ల నిర్వహణను సమీక్షించారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, మైన్స్ అండ్ జియాలజీ, మార్క్‌ఫెడ్, కమర్షియల్ టాక్స్, ఫారెస్ట్, రిజిస్ట్రేషన్ తో పాటు పలు ఇతర శాఖలలో గడచిన మూడు నెలలుగా 'జీరో ఫైల్స్' నమోదు కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై 100 శాతం ఈ-ఫైళ్ల ద్వారానే పాలన సాగాలని, ఫిజికల్ ఫైళ్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతీ నెలా జిల్లా అధికారులు తమ టూర్ డైరీని ఈ-ఆఫీస్ ద్వారానే సమర్పించాలని స్పష్టం చేశారు. ఫీల్డ్ విజిట్లకు వెళ్ళినప్పుడు అక్కడ పరిశీలించిన వివరాలను, ఫొటోలను ప్రతీరోజూ వాట్సాప్ ద్వారా తనకు నివేదించాలన్నారు. ఈ సమీక్షా సమావేశానికి పోలీస్ శాఖ నుండి ప్రతినిధులు హాజరుకాకపోవడంపై జిల్లా ఎస్పీకి లేఖ రాయాలని ఆదేశించారు. అలాగే పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై (అడ్వర్స్ న్యూస్) సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి వివరణలు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ నిర్దేశించారు.

## అయ్యా...కనికరించరా

**పార్వతీపురం జయజయహే**



తన కొడుకు పూర్తిగా అటిజం వ్యాధితో భాదపడుతున్నాడని , అయినా అధికారులు కనికరించకుండా పించను మంజూరు చేయడం లేదని భామిని మండలానికి చెందిన నారాయణరావు తెలిపారు . సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు . ఈ సందర్భంగా ఆయన తన భాదను తెలియజేస్తూ తన కుమారునికి 33 ఏళ్ల వయసు ఉ ంటుందన్నారు . రెండో వ్యక్తీ సహాయం లేనిదే కనీసం ఎలాంటి పని చేసుకోలేని పరిస్థితని వాపోయారు . తన కుమారుని సమస్య కళ్లెదుటే కనిపిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు . తాను ప్రభుత్వ ఉ ద్యోగిగా నమోదై ఉండటంతో పించను రాదని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు . తాను ఉద్యోగం నుండి పదవీ విరమణ చేసి ఆరేళ్లు కావస్తుందన్నారు. ప్రస్తుతం తనకు వస్తున్న పెన్షన్ సొమ్ము కుమారుని ఆరోగ్యం కోసమే వెచ్చిస్తున్నట్లు తెలిపారు . తన సమస్యను అర్ధంచేసుకుని పరిష్కరించాలని సచివాలయం , కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయాస తప్ప ప్రయోజనం లేదని చింతించారు. ప్రభుత్వం సమస్యకు పరిష్కారం దొరికేలా మార్పులు చేయాలని వేడుకుంటున్నారు .

For a pure tomorrow..
జయహే

# సినిమా ఫక్కీలో వరుస హత్యలు

(ప్రతాప్)

ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతుల జీవితంలో చోటుచేసుకున్న వరుస హత్యలు తెలంగాణలో కలకలం రేపాయి. గర్భిణి భార్య వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా ఉన్న చిత్తరి హరిబాబు ఆరు నెలల తర్వాత నిజామాబాద్‌లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో వైష్ణవి సోదరుడు గంధం సంతోష్‌ను నిజామాబాద్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.





జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి 'వైషు అమ్మ' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహించేది. ఆమెకు కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబుతో ప్రేమ వివాహం జరిగింది. మార్చి 17న వైష్ణవి తన ఇంట్లో మృతి చెందింది. అప్పటికి ఆమె నాలుగు నెలల గర్భిణి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేసి హరిబాబును అరెస్టు చేశారు.

వైష్ణవిని గొంతు నులిమి, కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనపు కట్నం వేధింపుల ఆరోపణలపై హరిబాబు తల్లి లక్ష్మి, అతడి సోదరులు ఆనంద్, అశోక్‌లపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. హరిబాబు జూలైలో బెయిల్‌పై విడుదలయ్యాడు.

సెప్టెంబర్ 17న సాయంత్రం నిజామాబాద్‌లోని రాజారాజేంద్ర కూడలి వద్ద హరిబాబుపై దాడి జరిగింది. కారులో వచ్చిన ముగ్గురు, నలుగురిలో ఒకరు బయటకు వచ్చి కొబ్బరికాయలు కోసే కత్తితో హరిబాబు మెడ, తలపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.. తీవ్ర గాయాలతో హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. దాడి దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి.

హరిబాబు హత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో వైష్ణవి సోదరుడు గంధం సంతోష్ పేరు వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా సంతోష్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు నిజామాబాద్ పోలీసులు తెలిపారు. రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది.

హరిబాబు హత్య తర్వాత సంతోష్ సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో విడుదల చేసి, తన చెల్లిని హత్య చేసిన హరిబాబును తానే చంపానని పేర్కొన్నాడు. ఆ హత్యలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతర నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

వైష్ణవి హత్య, హరిబాబు హత్య కేసుల దర్యాప్తు కొనసాగుతోంది. రెండు కేసుల్లోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై న్యాయపరమైన విచారణ కొనసాగాల్సి ఉంది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ దంపతుల జీవితంలో ఆరు నెలల వ్యవధిలోనే తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఆమె భర్త హరిబాబు అనంతరం నిజామాబాద్‌లో హత్యకు గురయ్యాడు. ఈ ఘటనతో రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. హరిబాబు హత్య కేసులో వైష్ణవి సోదరుడు సంతోష్‌ను పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతరుల ప్రమేయంపై విచారణ అనంతరం స్పష్టత రానుంది.

మన సమాజంలో హింసాత్మక ఘటనలు వేగంగా పెరుగుతున్నాయి. కుటుంబ విభేదాలు, ఆస్తి తగాదాలు, అనుమానాలు, క్షణికావేశం, ప్రతీకార భావనలు చివరకు హత్యలు, దాడులు, ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. ఒకప్పుడు సమస్యలను కుటుంబ పెద్దల సమక్షంలో చర్చించి పరిష్కరించుకునే సంప్రదాయం ఉండేది; ఇప్పుడు సంభాషణ స్థానంలో కోపం, సహనం స్థానంలో అసహనం, అనుబంధాల స్థానంలో స్వార్థం పెరుగుతున్నాయి. రక్తసంబంధాలు, వివాహ బంధాలు, స్నేహాలు కూడా అనుమానాలు మరియు ఆధిపత్య భావనలతో బలహీనపడుతున్నాయి. ఇతరుల బాధను అర్థం చేసుకునే మానవత్వం తగ్గిపోవడం, సోషల్ మీడియా ప్రభావంతో ప్రతీకారాన్ని సమర్థించే ధోరణి పెరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. చట్టంపై నమ్మకం, పరస్పర గౌరవం, కుటుంబ సంభాషణ, మానసిక ఆరోగ్యంపై అవగాహనను పెంచకపోతే హింస సమాజపు సాధారణ ప్రవర్తనగా మారే ప్రమాదం ఉంది.

(మీడియా వార్తల ఆధారంగా)



## జాతీయ హ్యాకథాన్‌లో ఐతంకు ప్రథమ బహుమతి

### నగదు చెల్లింపుల్లో వినూత్న పరిష్కార మార్గాలు

టెక్కలి సెప్టెంబర్ 21 జయ జయహే

జాతీయస్థాయి 36 గంటల హేక్యథాన్ ఇంక్యుబేట్ క్యాష్ యు హబ్ బృందంలో ఐతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. హైదరాబాదులో సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల హెక్టన్ నిర్వహించిన పోటీల్లో 65 బృందాలు ఎంపిక చేశారు, 36 గంటలు నిర్వహించిన ప్రాజెక్ట్ పరిశీలనలో నగదు చెల్లింపుల రంగములో నెలకొన్న సమస్యలను వినూత్నంగా పరిష్కార మార్గాలను రూపొందించిన ఐతం బృందానికి విజేతగా ప్రకటించి ప్రథమ బహుమతిగా 30 వేల నగదు బహుమతి అందజేశారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తి సాంకేతిక నైపుణ్యాలు సమస్యను పరిష్కరించే సామర్థ్యాలు పెంపొందించేందుకు ఐతం రైజ్ వేదికగా నిలుస్తుందని ప్రొఫెసర్ నాగేశ్వరరావు స్పష్టం చేశారు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ మనోజ్ కుమార్, హెచ్ ఓ డి లు అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



## రహదారి విస్తరణ ప్రతిపాదనలు

### పల్లె వారి వీధిలో పర్యటించిన ఎమ్మెల్యే కొణతాల..

అనకాపల్లి, (జయ జయహే) .

అనకాపల్లి పల్లె వారి వీధి నుంచి ఉమ్మలాడ హైవేను కలుపుతూ మాస్టర్ ప్లాన్ రూపుదిద్దుకుంటోంది. 1కిలోమీటరన్నర పొడవునా 40 అడుగులతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణ పనులకు మాజీమంత్రి ఎమ్మెల్యే కొణతాల శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు పల్లె వారి వీధిలో కొణతాల సోమవారం పర్యటించారు. రహదారి నిర్మాణం పై అంచనా వేశారు. పల్లె వారి వీధి నుంచి హైవే ను కలుపుతూ 40 అడుగుల రోడ్డుతో అనుసంధానం చేసే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణ శివారు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించటమే ఈ రహదారి నిర్మాణం ప్రధాన లక్ష్యం. ఈ ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తే పట్టణం నుంచి హైవేకు చేరుకునేందుకు పల్లె వారి వీధి మీదుగా వాహనదారులకు రాకపోకలు సులువవుతాయి. ఈ రహదారి నిర్మాణం జరిగితే పల్లె వారి వీధి ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. అపార్ట్మెంట్ల నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. గృహ నిర్మాణాలు జోరందుకుంటాయి. పల్లె వారి వీధి నుంచి హైవేను కలుపుతూ రహదారి నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. వారి కలలను నిజం చేస్తూ ఎమ్మెల్యే కొణతాల ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీంతో పల్లె వారి వీధి ప్రాంత వాసులు తమ హర్షం చేస్తున్నారు. ఎమ్మెల్యే కొణతాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆళ్ల రామచంద్రరావు, ఇంజనీరింగ్ ఈఈ, ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ, వివిధ శాఖల అధికారులు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో సుధాకర్ యాదవ్‌కు అరుదైన గౌరవం

యాదాద్రి భువనగిరి జిల్లా: (జయ జయహే)



ఆత్మకూర్ పట్టణంలోని పి.ఎస్. ఫంక్షన్ హాల్‌లో భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం--2026 సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన రక్తదాతలు, సామాజిక సేవకులను వారి సేవలను గుర్తించి ఈ కార్యక్రమంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 320 సార్లు రక్తదానం చేసిన సంపత్ కుమార్ హాజరయ్యారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కురిమేటి నవీన్ చేతుల మీదుగా అమ్మ ఫౌండేషన్ కోశాధికారి పేరగాని సుధాకర్ యాదవ్ ఉత్తమ సేవా పురస్కారం--2026 అందుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ..అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా దాతల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోఅనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వికలాంగులకు వీల్‌చైర్లు అందించడం, నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం వంటి పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు, నిరుపేదలకు, అవసరంలో ఉన్న వారికి అందిస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ సేవా పురస్కారంతో సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒక్క ప్రాణం కూడా రక్తం అందక కోల్పోకుండా యువత ముందుకు వచ్చి రక్తదాతలుగా మారాలని సుధాకర్ యాదవ్ పిలుపునిచ్చారు.



## పంచగ్రామాల భూములపై ఈ నెల 29న విచారణ

### అడవివరం ప్రజా రైతు హక్కు సాధన కమిటీ కి జేసీ హామీ

విశాఖపట్నం, సెప్టెంబర్ 21, జయ జయహే

అడవివరం గ్రామకంఠం భూముల సమస్యపై ఈ నెల 29న విచారణ చేపడతామని సంయుక్త కలెక్టర్ హామీ ఇచ్చారు. అడవివరం ప్రజా రైతు హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం పీజీఆర్ఎస్ లో సమర్పించిన సభ తీర్మానంపై ఆమె వెంటనే స్పందించి ఈ నిర్ణయం ప్రకటించారు. అడవివరం సర్వే నంబరు 81 ఏ లోని ఇరవై ఐదు ఎకరాల గ్రామకంఠం భూములు, పాత అడవివరం సర్వే నంబరు 42 ఏ లోని ఎనిమిది ఎకరాల యాభై ఎనిమిది సెంట్ల గ్రామకంఠం భూములు, విజినిగిరి సర్వే నంబరు 123లోని విజనగరిపాలెం ఒక ఎకరం అరవై ఆరు సెంట్ల గ్రామకంఠం భూములను, 22 ఏ ఒకటి సీ నుంచి తొలగించి, వేలాది కుటుంబాలకు హక్కులు కల్పించాలని కమిటీ కోరింది. ఈ మేరకు ఆదివారం జరిగిన గ్రామస్తుల సమావేశంలో అడవివరం ప్రజా రైతు హక్కుల సాధన కమిటీని ఏర్పాటు చేసి తీర్మానం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ దృష్టికి సభ తీర్మానాన్ని సమర్పించారు. అనంతరం సంయుక్త కలెక్టర్‌ను కలిసి భూముల సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆమె ఈ నెల 29న విచారణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, అడవివరం సహకార సంఘం చైర్మన్ కర్రీ స్వామి, సిరి పరుపు వరాహనరసింహం, భోగాపరుపు పైడికొండ, లంక వెంకటరమణ, కోరాడ అచ్యుతరావు, కొలుసు శ్రీనివాసరావు, బంధం రాంబాబు, బోర ప్రసాద్ రెడ్డి, సిరి పరుపు సత్తిబాబు, తలారి అశోక్, మజ్జి భీమ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి 56 వినతులు

విశాఖపట్నం, సెప్టెంబర్ 21, జయ జయహే



విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 56 వినతులు అందాయి. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, లైన్ షిఫ్టింగ్, కొత్త విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ బిల్లులు, పోల్ షిఫ్టింగ్ తదితర ఫిర్యాదులు మరియు వినతులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతులను సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా 9493681912 వాట్సాప్ నంబర్‌కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. కార్యక్రమంలో సీజీఎం పి. సోల్మన్ రాజు, జనరల్ మేనేజర్లు ఎం. ఝాన్సీ, వి.వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ ఛార్జీలు వద్దు..

### కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి

యూపీఐ చెల్లింపులపై ఛార్జీల నుంచి మినహాయింపు కోరిన రిటైలర్లు

అతి తక్కువ లాభాలతో వ్యాపారం చేస్తున్నామని ఆవేదన

0.4 శాతం ఎండీఆర్ విధిస్తే వ్యాపార మనుగడకే ప్రమాదమని హెచ్చరిక

ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా పెరిగాయని వెల్లడి

ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసిన మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్

జయ జయహే




యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది.

దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు, నెలకు రూ. 10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు యూపీఐ లావాదేవీలు జరిపే రిటైలర్‌పై ప్రతి నెలా రూ.4,000 నుంచి రూ. 16,000 వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది.

విక్రయాలు పడిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో మొబైల్ రిటైల్ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉందని అసోసియేషన్ తెలిపింది. దీనికి తోడు స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, 2025లో రూ. 10,000కు లభించిన ఎంట్రీ-లెవల్ స్మార్ట్‌ఫోన్ ధర ప్రస్తుతం రూ. 17,000కు చేరిందని, 2026 డిసెంబర్ నాటికి ఇది రూ. 20,000కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరహా రిటైలర్లకు యూపీఐ ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని, తక్కువ ఖర్చుతో కూడిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను కొనసాగించాలని ఏఐఎంఆర్ఏ ప్రభుత్వాన్ని కోరింది. ఫీజుల నిర్మాణంపై నిర్ణయం తీసుకునే ముందు వాణిజ్య సంఘాలతో సంప్రదింపులు జరపాలని విజ్ఞప్తి చేసింది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com